క్లుప్తంగా

రాజేంద్రప్రసాద్‌కు సత్కారం



రాజేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న సహ ఉద్యోగులు

దెందులూరు: దెందులూరు, కొవ్వలి, పోతునూరు ఉన్నత పాఠశాలలతో పాటు జిల్లా పరిషత్‌లో 42 ఏళ్లపాట రికార్డు అసిస్టెంట్‌గా, ఎన్‌జీవో సంఘ నేతగా విశిష్ట సేవలందించిన కాకర్ల రాజేంద్రప్రసాద్ అభినందనీయుడని ఎన్‌జీవో సంఘ నేతలు నందిగం భవాన్, ముళ్ళపూడి వెంకటేశ్వరరావు అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఆయన్ను ఆదివారం సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా నందిగం రామ్మోహనరావు, సిరిగినీడి రాధాకృష్ణ తదితరులు రాజేంద్రప్రసాద్ సేవలను కొనియాడారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



ఎమ్మెల్యే చింతమనేనికి వేంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేస్తున్న నేతలు

దెందులూరు: నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఆదివారం నాలుగు మండలాల నుంచి విచ్చేసిన ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. పరిష్కారానికి సంబంధిత శాఖల ఉద్యోగులకు సిఫార్సు చేశారు. సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల ఉద్యోగులు నిర్లక్ష్యం వహించకుండా పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం నియోజకవర్గ సమన్వయకమిటీ సభ్యులు ఉప్పలపాటి శ్రీరామప్రసాద్, గారపాటి రామసీత, మోరు శ్రావణి, దశరధ్, గుత్తా అనిల్, లావేటి శ్రీనివాస్, ఎం. వెంకటేశ్వరరావు, ముళ్ళపూడి సాంబశివరావు, వెంకటేశ్వర స్వామి ప్రతిమను అందించి సత్కరించారు.

సేవల ద్వారానే ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తింపు



ఉదయకుమార్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: ప్రభుత్వ ఉద్యోగులు తమ సేవల ద్వారానే ప్రజల్లో గుర్తింపు పొందుతారని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎన్‌వీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మండవ ఉదయకుమార్ ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక వై.జంక్షన్ ఫంక్షన్ హాలులో ఆదివారం ఆయనకు సన్మాన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ఈ మాట్లాడుతూ 40 సంవత్సరాల సుదీర్ఘ అనుభవంలో ఉదయ్ కుమార్ చేపట్టిన పనులను కొనియాడారు. ముఖ్యంగా తాగునీటి సమస్య పరిష్కారానికి ఉదయకుమార్ చేసిన కృషిని ఆదర్శంగా తీసుకుంటామని సహచర ఏఈలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉదయకుమార్ దంపతులను సత్కరించి మొమెంటోలు అందజేశారు. డీఈడీవో ఎం.రాజు, రిటైర్డ్ ఎస్ఈలు జీవీ రాఘవులు, రామారావు, ఈఈ త్రినాధబాబు, డీఈలు సత్యనారాయణ సురేష్ రమేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

లింగపాలెం: వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని ఆ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి అన్నారు. ఆదివారం లింగపాలెంలోని ఆయన గెస్ట్ హౌస్‌లో పార్టీ ముఖ్యనేతలతో చర్చించారు. ఈ సందర్భంగా బీవీఎస్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. కొన్ని గ్రామాల్లో టీడీపీ శ్రేణులు వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులకు పాల్పడటం, వైఎస్సార్ సీపీకి చెందిన వారి భూముల్లో చెట్లు నరకటం, పొలాల్లో కట్టవాలు తొలగించటం వంటివి చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. రాజకీయ పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవని, ఇది గమనించాలని టీడీపీ నేతలకు హితవు పలికారు. తాను ప్రజలకు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని బీవీఎస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మందలపు సాయిబాబు, సర్పంచ్‌లు తాడేపల్లి శాంతరావు, కట్టుబోయిన రమేష్, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు మునునూరి వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, నాయకులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న చండీ హోమం

కొయ్యలగూడెం: శ్రీకాత్యాయని పీఠంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న చండీ హోమం సోమవారంతో ముగియనుంది. జూన్ 29న హోమాన్ని బ్రహ్మశ్రీ దాస రోజు శ్రీనివాసాచార్యులు ప్రారంభించారు. లోక కళ్యాణార్థం ప్రతి సంవత్సరం హోమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వర్షాలు సకాలంలో కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండేందుకు హోమాన్ని సంకల్పించినట్లు తెలిపారు.

బెంగాలీలతో వరి నాట్లు.. అధికంగా దిగుబడులు



కోడూరుపాడులో వరి నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు



ఉడ్పు యంత్రం తరహాలో నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

- వ్యవసాయ శాఖ సూచనలతో సాగు పద్ధతిని అనుసరిస్తున్న కూలీలు
- తక్కువ ఖర్చు, తక్కువ నారు వినియోగం
- ఉడ్పు యంత్రం మాదిరిగా నాట్లు



దుద్దేపూడిలో ఏపుగా ఎదిగిన వరి నారు

భీమడోలు: బెంగాలీ కూలీలకు ఆదరణ పెరిగింది. వారి నేర్పరితనంతో వరినాట్లు వేస్తూ రైతులను ఆకట్టుకుంటున్నారు. వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు పనులు ఊపందుకున్నాయి. ఇప్పటికే మెట్ట ప్రాంతాల్లో బోర్ల కింద సాగు ప్రారంభించిన రైతులు వరి నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. బెంగాలీ కూలీలు బెంగాల్ అనుసరించే సాగు పద్ధతిని ఇక్కడ అవలంబించడంతో సాగు పనులు చురుగ్గా సాగుతున్నాయి. స్థానిక వ్యవసాయ కూలీల కన్నా బెంగాలీ కూలీలు వరి నాట్లు వేయడం వల్ల ఖర్చు తగ్గడం, తక్కువ నారు వినియోగం, ఆశాజనకమైన దిగుబడులు వస్తున్నాయి. పంటకు తెగుళ్ల బెడద తగ్గడంతో రైతులు అధిక పెట్టుబడుల నుంచి ఉపశమనం పొందుతున్నారు. దీంతో రైతులు స్థానిక కూలీల కన్నా బెంగాలీ కూలీలపైనే ఆధారపడుతున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల్లో 40,597 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేస్తున్నారు. ఇప్పటికే 2,031 ఎకరాల్లో నారుమడి విస్తీర్ణం కాగా, ఇప్పటి వరకు 1,635 ఎకరాల్లో వరి నారుమడులు వేశారు. 437 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. నిడమర్రు, గణపవరం మండలాల్లో వరి నాట్లు ప్రక్రియ ప్రారంభం కాలేదు. అయితే భీమడోలు, ఉంగు టూరు మండలాల్లోని పలు ప్రాంతాలకు కూలీల రాక పెరిగింది. బెంగాలీ కూలీలతో నాట్లు వేయిస్తున్నారు.

స్థావరాలు ఏర్పాటు

ఉంగుటూరు నియోజకవర్గంలో పరిధిలోని పలు గ్రామాలకు బెంగాలీ కూలీలు వచ్చి జట్లుగా స్థావరాలను ఏర్పాటు చేసుకున్నారు. కాంట్రాక్ట్ ప్రాతిపదికన తెల్లవారుజామున జట్లు ప్రారంభించి మధ్యాహ్నానికే వరి నాట్లు పూర్తి చేస్తున్నారు. స్థానిక రైతులు గతంలో ఎకరానికి 25 కిలోల విత్తనాలను నారు కోసం వినియోగించేవారు. బెంగాలీ కూలీల వల్ల ఎకరానికి 15 నుంచి 20 కిలోల విత్తనాలను మాత్రమే వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు సాగు ఖర్చు తగ్గుతుంది. స్థానిక కూలీలు 30 రోజుల వయస్సుగల నారును మాత్రమే నాట్లు వేసేందుకు వినియోగిస్తారు. బెంగాలీ కూలీలు 15 నుంచి 20 రోజుల వయస్సుగల నారును వినియోగించి నాట్లు వేస్తున్నారు. బెంగాలీలు వేసిన నాట్లు 4, 5 రోజుల సమయానికి మూనలు తిరుగుతుంటే, స్థానిక కూలీలు వేసే నాట్లుకు సుమారు 10 రోజులు సమయం పడుతుంది. బెంగాలీలు ఉడ్పునకు ఎకరాకు 10 నుంచి 15 పోగులు వాడుతుంటే, స్థానిక కూలీలు సుమారు 45 పోగులకు పైగా వినియోగిస్తున్నారు. ఎకరా చేలో నాట్లు వేసేందుకు సాధారణంగా కూలీలు ఆరుగురు అవసరం కాగా, బెంగాలీ కూలీలు నలుగురుతో పని పూర్తి చేస్తున్నారు. దీంతో ఖర్చుతో పాటు దిగుబడుల్లో తేడా కనిపిస్తుంది. ఎకరాకు 5 బస్తాల దిగుబడులు అదనంగా వస్తుందని రైతులు చెబుతున్నారు. కౌలు రైతులు బెంగాలీ కూలీలతోనే వరి నాట్లు వేయిస్తున్నారు. సాగు ఖర్చు సుమారు రూ.5 వేల వరకు తగ్గుతుందని చెబుతున్నారు.

డెల్టా మండలాల్లో మందకొడిగా పనులు

ఉంగుటూరు నియోజకవర్గంలో భీమడోలు, ఉంగుటూరు మండలాలు పాక్షిక డెల్టా మండలాలు కాగా, నిడమర్రు, గణపవరం మండలాలు డెల్టా మండలాలు. అయితే నైరుతి రుతిపవనాలు ఆలస్యమవడంతో డెల్టా మండలాల్లో సాగు పనులకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఆ ప్రాంత రైతులు పనులు ప్రారంభించారు. మెట్ట ప్రాంతాల్లోని బోర్ల కింద సాగు చేసిన రైతులు వరి నాట్లు వేసే పనిలో తలమునకలయ్యారు. బెంగాలీ కూలీలు రావడంతో ఆ ప్రాంతాల్లోనూ వరి నాట్లు వేస్తున్నారు. అక్కడ పూర్తి కాగానే డెల్టా మండలాల్లో నాట్లు వేస్తున్నారని రైతులు చెబుతున్నారు.

నెలాఖరు నాటికి వరి నాట్లు పూర్తి చేయాలి



బెంగాలీ కూలీలతో వరి నాట్లు వేయించేందుకు రైతులు మొగ్గ చూపుతున్నారు. వర్షాలు ఆలస్యమవ్వడంతో వెదజల్లే పద్ధతిని రైతులు అనుసరిస్తున్నారు. సాధారణ పద్ధతిలో వరి నాట్లు వేసే రైతుల్లో అధిక శాతం బెంగాలీ కూలీలతో వరి నాట్లు వేయిస్తున్నారు. దీంతో రైతులకు సమయం, సాగు ఖర్చు తగ్గుతుంది. బెంగాలీ కూలీలు వ్యవసాయ శాఖ సూచనల మేరకు నాట్లు వేయడంతో మంచి దిగుబడులు సాధిస్తున్నారు. భీమడోలు సబ్ డివిజన్ పరిధిలో రైతులు పీఎల్, 1318, స్వర్ణ రకాల వరి సాగు చేస్తున్నారు. 1121 రకాన్ని విత్తనాల కోసం సాగు చేస్తున్నారు. వరి నాట్లు జూలై నెలాఖరు నాటికి పూర్తి చేసుకోవాలని రైతులకు సూచించాం.

– పి.ఉషారాజకుమారి, ఏడీఏ, భీమడోలు

సాగు వివరాలు ఇలా (ఎకరాల్లో)

మండలం	మొత్తం విస్తీర్ణం	నారుమడి విస్తీర్ణం	నాట్లు పడిన విస్తీర్ణం
భీమడోలు	13,362	668	186
ఉంగుటూరు	23,672	1,185	251
నిడమర్రు	3,563	178	నిల్
గణపవరం	11,713	586	నిల్

ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలి



ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

దెందులూరు: జిల్లాలోని రైతాంగ సమస్యలను పరిష్కరించి అన్నదాతలను ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. ఆదివారం దెందులూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం విక్రయించిన రైతులకు ఇవ్వాల్సిన రూ.240 కోట్ల ధాన్యం బకాయి సొమ్ములు వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించేందుకు జారీ చేసిన జీవో 22ను రద్దు చేయాలన్నారు. సమగ్ర భూ సర్వేలో జరిగిన లోపాలను సరిచేసి ఖచ్చితమైన పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలన్నారు. సమగ్ర పంటల బీమా పథకాన్ని తీసుకురావాలని, పంటల బీమా ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలన్నారు. భూ యజమానుల సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, వడ్డీ లేని పంట రుణాలు, నష్టపరిహారాలు ఇవ్వాలన్నారు. కనీస ధర రాక నష్టపోతున్న కొబ్బరి రైతులను ఆదుకునేందుకు కొబ్బరి కొనుగోలు కేంద్రాలు తెరవాలన్నారు. సీడ్ మొక్కజొన్న విత్తన కంపెనీలపై ప్రభుత్వ అజమాయిషీ ఉండాలన్నారు. సీడ్ మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులకు విత్తన కంపెనీల నుంచి అగ్రిమెంట్స్ ఇప్పించాలన్నారు. ఉద్యానవన పంట రైతులకు ఇవ్వాల్సిన సబ్సిడీ బకాయిలు అందించాలన్నారు. ఆక్వా రైతులకు విద్యుత్ యూనిట్ రూ.1.50కే ఇవ్వాలని, ఆక్వా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఆయిల్‌పామ్ టన్ను గెలలకు రూ.18 వేలు ధర ప్రకటించాలని, తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా ద్వారకాతిరుమల, దెందులూరు మండలాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది



నాచుగుంట ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు, గ్రామస్తులు

ఉంగుటూరు: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, తనకు ఈ ఉద్యోగం ఎంతో సంతృప్తినిచ్చిందని ఉద్యోగ విరమణ పొందిన ముప్పన వెంకటేశ్వరరావు అన్నారు. నాచుగుంట పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వెంకటేశ్వరరావు దంపతులను ఆదివారం గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కె.శ్రీనివాసరావు, విద్యా కమిటీ చైర్మన్ ప్రమీళా, ప్రజాప్రతినిధులు సుబ్బారావు, ఏలేటి సురేష్, ఇమ్మని గంగాధరరావు, చిట్టూరి హరిబాబు, కొరపాటి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇదే పాఠశాలలో పని చేసి వేరే చోటకు బదిలీ అయిన బొమ్మిడి ప్రసాద్ ఉపాధ్యాయుడిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వునుముల రాంబాబు, డాకి జోగినాయుడు, అల్లుశ్రీను, శీతాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా బోధించాలి



కలెక్టర్ వెట్రి సెల్వికి పూలమొక్క అందిస్తున్న డెమోక్రటిక్ పీఆర్‌టీయూ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు మరింత సమర్థవంతంగా పాఠ్యాంశాలను బోధించాలని, చిత్తశుద్ధితో సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి సూచించారు. జిల్లా కలెక్టర్‌గా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన వెట్రిసెల్వి ని కలెక్టరేట్ చాంబర్లో డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎం అచ్యుతరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి, పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచే విధంగా విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఇంటింటికీ తిరిగి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో లభిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసి వారిని ప్రభుత్వ పాఠశాల వైపు ఆకర్షించేలా చేయాలన్నారు. పాఠ్య, నోట్‌పుస్తకాలు, బ్యాగులు, యూనిఫారం, షూస్, టై, బెల్ట్ అందజేయడంతో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు సరఫరా చేయాలని అన్నారు. విద్యార్థుల స్థాయిని తెలుసుకుని బోధన చేసి వారి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం రాష్ట్ర బాధ్యుడు ఆర్ నాగేంద్ర సింగ్, జిల్లా అధ్యక్షుడు నేతల ఆజాద్ తదితరులు ఉన్నారు.

కఠారి రామమూర్తి సేవలు ఆదర్శనీయం



రామమూర్తిని సన్మానిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, ఉపాధ్యాయులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఎందరో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్ది వారి ఉన్నతికి సహకరించిన ఉపాధ్యాయుడు కఠారి రామమూర్తి అభినందనీయులని, ఆయన సేవలు ఇతరులకు ఆదర్శప్రాయమని ఏలూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నెరుసు చిరంజీవులు అన్నారు. తొలుత ఏలూరు మున్సిపాలిటీ ఆ తర్వాత కార్పొరేషన్ పరిధిలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన కఠారి రామమూర్తి శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏలూరులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కఠారి రామమూర్తి, ఫణి రాజకుమారి దంపతులను వారి కుమార్తెలు, ఎన్నారైలు అక్షయ, మాధురి, నీరజ ఇతర కుటుంబ సభ్యులతో పాటు ఆయన స్నేహితులు, సహ ఉపధ్యాయులు, అభిమానులు సత్కరించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏలూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నెరుసు చిరంజీవులు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన కఠారి రామమూర్తి తన శేష జీవితంలో సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. సన్మాన గ్రహీత కఠారి రామమూర్తి మాట్లాడుతూ, తన ఉన్నతికి కుటుంబ సభ్యులతో పాటు కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది ఉండి భాస్కరరావు, షేక్ హజరత్, ఎన్ రామారావు, అల్లూరి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్ సోమశేఖర్‌కు సత్కారం

ఏలూరు (టూటౌన్): డిప్యూటీ కలెక్టర్ హోదాలో జిల్లా విద్యాశాఖ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా పనిచేసిన బి.సోమశేఖర్ ఉద్యోగ విరమణ సందర్భంగా కాపు సంక్షేమ సేన నాయకులు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలు నందు ఆదివారం ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పులి శ్రీరాములు మాట్లాడుతూ సోమశేఖర్ ఏలూరు తహసీల్దార్‌గా, డిప్యూటీ కలెక్టర్‌గా చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు పూజారి నిరంజన్, మోటేపల్లి చంద్రశేఖర్, సామర్ల వెంకటేశ్వరరావు, గునిశెట్టి రాజేష్, విఠాల శేషగిరి, మంచెం వెంకటేశ్వరరావు, కురెళ్ల భాస్కర్, సవిరే రాజేష్, గుద్దటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక రంగ సమస్యలను పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): అసంఘటిత రంగం కార్మికుల బోర్డులను వెంటనే తెరిపించాలని, భవన నిర్మాణ, హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డును పరిరక్షించాలని, పెండింగ్‌క్లెయిమ్‌లను విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేవీ రమణ, బద్దా వెంకట్రావులు డిమాండ్ చేశారు. స్థానిక ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో కేవీ రమణ అధ్యక్షతన ఇఫ్టూ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. రమణ, వెంకట్రావులు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వాలు కార్మిక రంగంలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ రామ్మోహన్, పి.నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఇ.గ్రీష్మ కుమార్, ఎండీవీ ప్రసాద్, కె.అప్పారావు, కె.శ్రీనివాస్, జి.రాంబాబు, మంగం అప్పారావు, పి.గంగరాజు, ఎస్ నెహ్రూ బాబు, ఎం రాము తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో 'చదవడం మాకిష్టం'



భీమడోలులో సామూహిక పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

భీమడోలు: సామూహిక పుస్తక పఠనం ద్వారా విద్యార్థులకు విజ్ఞానం అందుతుందని పలువురు పేర్కొన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారులు పాల్గొని నీతి పుస్తకాలు, జాతీయ నాయకులు జీవిత చరిత్రలు, ఆధ్యాత్మిక, జనరల్ నాలెడ్జికు చెందిన పుస్తకాలను చదివారు. వాటిపై సమీక్షలు రాశారు. నీతి కథలు వివరించారు. విద్యార్థులు ప్రతి నిత్యం గ్రంథాలయాలను సందర్శించి పుస్తకాలను పఠించి, దినపత్రికలను చదివి మరింత విజ్ఞానాన్ని పొందాలని గ్రంథపాలకుడు కోరారు. పుస్తక పఠనాసక్తిని పెంపొందించుకునే గ్రంథాలయాలు వేదికలన్నారు. పుస్తకం 100 మంది మిత్రులతో సమానమని వారికి వివరించారు. కార్యక్రమా ల్లో గ్రంథపాలకులు, పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొహర్రం కార్యక్రమాల కరపత్రం విడుదల



మొహర్రం కార్యక్రమాల కరపత్రం విడుదల చేసిన పీర్ల పంజా కమిటీ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో మొహర్రం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు పీర్ల పంజా కమిటీ గౌరవాధ్యక్షుడు ఎస్‌కే రాజా అహ్మద్ తెలిపారు. ఆదివారం స్థానిక కుండీ సెంటర్‌లోని గొలుసుల పంజాలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మొహర్రం నెలను ముస్లింలు అమరవీరుల నెలగా వర్ణిస్తూ.. వర్ధంతిలా నిర్వహిస్తామని తెలిపారు. ముహమ్మద్ ప్రవక్త యొమి ఆషురా ఆయన మనువడైన ఇమామ్ హుస్సేన్ ఇబ్నేఅలి కర్బలా యుద్ధంలో అమరుడైన రోజును ముహర్రంగా జరుపుకుంటామన్నారు. ముహర్రం మాసం ఆరంభం రోజునే ఇస్లామ్ నూతన సంవత్సరం ప్రారంభమౌతుందని చెప్పారు. కమిటీ అధ్యక్షుడు ఎండీ గాలబ్ అలీ మాట్లాడుతూ దాదాపు 15 పంజాల్లో మొహర్రం కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు చేట్టామన్నారు. తొలుత ఈ నెల 8వ తేదీన కుండీ సెంటర్‌లోని గొలుసుల పంజాలో పీర్లను నిలిపి ప్రత్యేక ప్రార్థనలు చేస్తామని తెలిపారు. ఐదో రోజున నగరంలోని ఇతర ప్రాంతాల్లోని పంజాల్లో సైతం పీర్లను నిలిపి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని వివరించారు. గన్ బజారులోని జల్‌జలా సాహెబ్ ఆస్థాన ప్రాంగణంలో నిప్పుల గుండం తొక్కే కార్యక్రమాలు ఉంటాయన్నారు. 17వ తేదీన మొహర్రం రోజును పురస్కరించుకుని నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిలిపిన పీర్లతో స్థానిక కుండీ సెంటర్ నుంచి భారీ ఊరేగింపు నిర్వహించి స్థానిక పాత బస్టాండు వద్ద ఉన్న కర్బలా మైదానంలో పీర్లను నిమజ్జనం చేస్తామని చెప్పారు. కార్యక్రమాల్లో కులమతాలకు అతీతంగా నగర ప్రజలు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా మొహర్రం కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. సమావేశంలో పీర్ల పంజా కమిటీ ప్రతినిధులు ఎస్‌కే ఖాదర్ బాబా, ఎండీ రజాక్, ఎండీ బషారతుల్లా బేగ్, ఎస్‌కే సర్దార్, ఎస్‌కే రహీమ్ బాజీ, ఎస్‌కే షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

విజయా గార్డెన్స్ వాసుల సమస్యలు పరిష్కరించండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని పోస్టల్ కాలనీ పక్కన ఉన్న విజయగార్డెన్స్ వాసుల సమస్యలు పరిష్కరించాలని విజయా గార్డెన్స్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బీఎల్ నరసింహారావు ప్రజా ప్రతినిధులు, అధికారులను కోరారు. ఆదివారం స్థానిక విజయా గార్డెన్స్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తూతా గోపాలరావు అనే వ్యక్తి 60 ఏళ్ల క్రితం లే అవుట్ వేయగా, తామంతా స్థలాలు కొని స్థిర నివాసాలు, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకుని మున్సిపాలిటీ ఆస్తి, నీటి పన్నులు కడుతూ వస్తున్నామని తెలిపారు. తమ స్థలాలకు సంబంధించిన బ్రహ్మానందగిరి స్వాముల ఆశ్రమాన్ని దేవాదాయ శాఖ స్వాధీనపరుచుకోదలచిందన్నారు. ఆ సర్వే నెంబర్‌ను రిజిస్ట్రేషన్ శాఖలో బ్లాక్ చేశారని, దీంతో తమ స్థలాల క్రయవిక్రయాలకు రిజిస్ట్రేషన్ కావడం లేదని వాపోయారు. దీనిపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు, స్థానిక ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితంలేదన్నారు. కొత్త ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. తమ ప్రాంతంలో ఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ఆదాయాన్ని ఆలయ కమిటీ పేరిట కొందరు పక్కదారి పట్టిస్తుడడంతో 2023 జనవరి నెలలో ఆలయాన్ని దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకుని కార్యనిర్వహణాధికారిని నియమించిందని తెలిపారు. అయితే కార్యనిర్వహణాధికారి కలగర శ్రీనివాస్ ఆలయ అభివృద్ధి కమిటీతో చేతులు కలిపి స్వామి వారికి నెలకు వస్తున్న సుమారు రూ.1.20 లక్షలను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. అర్చకులు ఊటుకూరి నాగేశ్వర శర్మ, ఊటుకూరి సాయిబాబు శర్మలను ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, కార్యనిర్వహణాధికారి మానసికంగా వేధించి ఆలయం నుంచి వెళ్లగొట్టారని తెలిపారు. అర్చకులకు తిరిగి స్వామివారి సేవ చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు.

గుడివాకలంక సర్పంచ్‌గా ఘంటసాల నాగరాజు !

ఏలూరు రూరల్ : గుడివాకలంక సర్పంచ్‌గా (అనధికార) ఘంటసాల నాగరాజు ఎన్నికయ్యాడు. సమీప ప్రత్యర్థి జయమంగళ దొరబాబుపై 18 ఓట్ల మెజారిటీతో విజయం సాధించాడు. ఆదివారం ఉదయం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తు లు జయమంగళ బాలకృష్ణ, పతాని బలే చక్రవర్తి పర్యవేక్షణలో పెద్దలు పోలింగ్ చేపట్టారు. 1 బంటా గ్రూప్ నుంచి 30 మంది చొప్పున మొత్తంగా 10 బీసీ బంటాలు, 1 ఎస్సీ బంటాకు చెందిన 330 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. గ్రామ కట్టుబాటు ప్రకారం ప్రజలు, బంటా పెద్దలు కలిసి గ్రామ సర్పంచ్‌గా ఒక వ్యక్తిని ఎన్నుకుంటారు. తిరిగి అదే వ్యక్తి ఎన్నికల సంఘం నిర్వహించే పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ వేస్తే, ప్రజలు అధికారిక సర్పంచ్‌గా ఎన్నుకుంటారు. కట్టుబాట్లు ప్రకారం 2020లో ఎన్ను కోబడిన జయమంగళ ప్రభావతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరురాలు కావడంతో పచ్చనేతలు ఆమెతో రాజీనామ చేయించారు. ఆమె స్థానంలో టీడీపీకి చెందిన నాగరాజు, దొరబాబు ఇప్పుడు పెద్దలు నిర్వహించిన ఎన్నికల్లో పోటీపడ్డారు.

నలుగురు జూదరుల అరెస్ట్

జంగారెడ్డిగూడెం: స్థానిక ముత్రాసుల పేటలో ఆదివారం కోడిపందేలపై దాడి చేసినట్లు ఎస్సై జ్యోతిబాస్ తెలిపారు. ఈ దాడిలో కోడిపందేలు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వీరినుంచి రూ.1050 నగదు, ఒక కోడిపుంజు, ఒక కోడి కత్తి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.